క్లుప్తంగా

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

పలమనేరు: పట్టణ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ బాలికల కళాశాలలో 2024 పాలిసెట్‌కు ఉచిత శిక్షణ ఏప్రిల్1 నుంచి 24వ తేదీ వరకు ఇవ్వనున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ మహమూద్ శుక్రవారం తెలిపారు. ఏప్రిల్ 27న పాలిసెట్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారని, దీనికిగాను దూర ప్రాంతాలకెళ్లి కోచింగ్‌కు విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ ప్రాంత విద్యార్థినీ విద్యార్థుల కోసం ఉచిత శిక్షణతో పాటు స్టడీమెటీరియల్ కూడా ఇవ్వనున్నట్టు చెప్పారు. ఆసక్తి గల వారు కళాశాల పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

అవుట్ సోర్సింగ్ కుటుంబానికి ఆర్థికసాయం



గంగమ్మకు ఆర్థికసాయం ఇస్తూ, ఓదారుస్తున్న యూనియన్ నాయకులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో అవుట్ సోర్సింగ్ (ఆప్కాస్)లో కార్మికురాలిగా పనిచేస్తున్న గంగమ్మ కుటుంబానికి సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందచేశారు. గంగమ్మ భర్త కొండయ్య అనారోగ్యంతో మృతి చెందగా.. శుక్రవారం వెంగళరావు కాలనీకి వెళ్లిన ఆ సంఘం నాయకులు లోకనాథం, పెద్ద సంఖ్యలో కార్మికులు యూనియన్ తరపున రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కష్టాల్లో ఉన్న తోటి కార్మికురాలికి యూనియన్ ఎపుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

యుగంధర్‌కు సాహిత్య కళామణి బిరుదు



యుగంధర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పలమనేరు: పట్టణానికి చెందిన కవి, రచయిత, చిత్రకారుడు, సామాజిక కార్యకర్త యుగంధర్ బాబుకు స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి, పలమనేరు రచయితల సంఘం సంయుక్తంగా పట్టణంలో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో సాహిత్య కళామణి బిరుదుతో ఘనంగా సన్మానించారు. సామాజిక, సాహితీ కళారంగాలకు ఆయన చేసిన సేవలను గుర్తించి ఈ సన్మానం చేసినట్టు నిర్వాహకులు పలమనేరు బాలాజీ, తులసీనాథం నాయుడు, మల్లిచెట్ల దేవేంద్ర తదితరులు తెలిపారు.

నేత్రపర్వంగా ఊంజల్‌సేవ



నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం అమ్మవారు ఉయ్యాల సేవలో భక్తులను కటాక్షించారు. వేకువజామున సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి నిత్యపూజా కైంకర్యాలను నిర్వహించారు. ఉదయం 7 గంటలకు శ్రీవెంకటేశ్వరస్వామికి, 8 గంటలకు శ్రీపద్మావతీ అమ్మవారికి శుక్రవార అభిషేకాలను పూర్తి చేశారు. సాయంత్రం కైంకర్యాల అనంతరం అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. అంతర ప్రాకారంలో ఊరేగిన అమ్మవారు ఊంజల్ మండపంలో ఊయలలో కొలువుదీరి ఊంజల్ సేవలో పాల్గొన్నారు. మంగళవాయిద్యాల నడుమ ఊయలలో సేద తీరుతున్న అమ్మవారని భక్తులు దర్శించి తరించారు. భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

వాహనం ఢీ: వ్యక్తికి గాయాలు

శ్రీరంగరాజపురం: గుర్తు తెలియని వాహనం ఢీకొని పోస్టుమాస్టర్‌కు తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి నెళవాయి వద్ద చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. మండలంలోని శెట్టివానత్తంకు చెందిన పోస్టుమాస్టర్ మేఘనాథరెడ్డి(55) సొంత పనుల నిమిత్తం తమిళనాడులోని పళ్లిపట్టుకు ద్విచక్రవాహనంలో వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. నెళవాయి వద్ద వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీకొనడంతో ఆయన కుడి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ప్రైవేటు వాహనంలో ఆయన్ను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అనుమానాస్పద మృతిపై ధర్నా

గంగాధరనెల్లూరు: మండలంలోని వింజం గ్రామానికి చెందిన ధనుష్(19) రెండు రోజుల క్రితం అనుమానాస్పదంగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతనిది ఆత్మహత్య కాదని, హత్యేనని ఆరోపిస్తూ మృతుని బంధువులు శుక్రవారం మృతదేహంతో ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు పోస్టుమార్టం నివేదిక రాగానే విచారణ చేపడతామని హామీ ఇవ్వడంతో శాంతించారు. ఆపై మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

జగనన్నకే మళ్లీ పట్టం కడదాం



చిత్తూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న విజయానందరెడ్డి



గుడిపాల: మహిళలతో కలిసి డాన్స్ చేస్తున్న విజయానందరెడ్డి

- ఎన్నికల ప్రచారంలో చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి
- గుడిపాల మండలంలోనూ పర్యటన

చిత్తూరు కార్పొరేషన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్ని పార్టీలు జతకట్టి వచ్చినా, మనం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే మరోసారి పట్టం కడదామని వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక వినాయకపురంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు కూటమి కట్టారన్నారు. అలాంటి నాయకుడిని, పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాలని సూచించారు. తమ ప్రభుత్వం 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిందన్నారు. నవరత్నాలతో పేదల జీవితాలు బాగుపడ్డాయన్నారు. కుల, మతాలు, రాజకీయాలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. గత టీడీపీ పాలనలో పేదలు ప్రభుత్వ పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని గుర్తుచేశారు. ఇప్పుడు ఎక్కడా ఆ పరిస్థితి లేదని సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పథకాలు వస్తున్నాయన్నారు. మంచి చేసేందుకు వచ్చే ఎన్నికల్లో చిత్తూరు ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, నగర పార్టీ అధ్యక్షులు టిమ్ము, కార్పొరేటర్ ప్రభావతి, నాయకులు సంతోష్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు జగన్‌కే సాధ్యం

గుడిపాల: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి తెలిపారు. 197రామాపురం పంచాయతీలో శుక్రవారం ఎన్నికల ప్రచారం మండల పార్టీ అధ్యక్షుడు జనార్దన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేసినట్లు చెప్పారు. అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రతి ఇంట్లో రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు లబ్ధి చేకూరిందని వివరించారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు జల్లెడ పట్టి మరీ అందజేసినట్లు చెప్పారు. టీడీపీ పాలనలో పచ్చ చొక్కాల వారికే సంక్షేమ పథకాలు వచ్చేవని గుర్తు చేశారు. జన్మభూమి కమిటీల పేరుతో గ్రామాల్లో ఎవరికి వారు దోచుకున్నారన్నారు. 2014లో చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోలో రుణమాఫీ, డ్వాక్రా సంఘాల రుణాలను పూర్తిగా రద్దు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేసినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన హామీల్లో 99 శాతం నెరవేర్చినట్లు గుర్తుచేశారు. ఏదైనా చెప్పాడంటే చేస్తాడన్న నమ్మకం ప్రజలకు ఏర్పడిందన్నారు. ఇప్పటికే 130 సార్లు బటన్‌లు నొక్కి ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించినట్లు గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపైన రెండు బటన్‌లు నొక్కి అఖండ విజయంతో గెలిపించాలని కోరారు. అనంతరం మహిళలతో కలిసి కాసేపు సరదాగా డాన్స్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సర్పంచులు మధుసూదన్ రెడ్డి, రజినీకాంత్, మధుసూదన్‌రాయల్, విక్టర్, రవియాదవ్, రమేష్, నవీన్, సుధాకర్‌నాయుడు, ఎంపీటీసీలు శ్రీదేవి, సాముయేల్, గోళ్ల హరిప్రసాద్, డానియల్, వైఎస్సార్‌సీపీ నాయకులు శిలంబరసన్, రవీంద్రారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శ్రీరాములురెడ్డి, కలైఅరసి, వెంకటేష్‌రెడ్డి, ప్రసాద్, నేతాజీ, సాయిక్రిష్ణ తోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ క్రియాశీలక సమావేశం

పూతలపట్టు: మండల కేంద్రంలో పాత సినిమా థియేటర్ వద్ద శనివారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు, క్రియాశీలక కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3వ తేదీ మేమంతా సిద్ధం–బస్సుయాత్రలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూతలపట్టు నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా ముందస్తు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐదు మండలాల పార్టీ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, క్రియాశీలక కార్యకర్తలు పాల్గొనాలని తెలిపారు.

గో సంరక్షణకు విరాళం



అధికారులకు విరాళం అందజేస్తున్న దాత

కాణిపాకం (చిత్తూరు రూరల్): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయ నిత్య అన్నదానం, గో సంరక్షణకు శుక్రవారం ఓ దాత విరాళం అందించారు. ఐరాల మండలం వడ్రంపల్లెకు చెందిన దాత గురజాల ఉమాపతి నాయుడు, నిత్య అన్నదానానికి రూ.1,00,116, గో సంరక్షణ ట్రస్టుకు రూ.80,000 విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులు దాత కుటుంబ సభ్యులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, పర్యవేక్షకులు కోదండపాణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నాగాలమ్మ విగ్రహ ప్రతిష్ట



అభిషేకం చేస్తున్న ఆలయ ధర్మకర్త జయచంద్రారెడ్డి, స్థానికులు, ప్రత్యేక అలంకరణలో నాగాలమ్మ



ఆలయంలో కలశ పూజలు చేస్తున్న భక్తులు

తవణంపల్లె: మండలంలోని అరగొండలోని నాగాలమ్మ దేవస్థానంలో రెండు రోజులపాటు భక్తిప్రపత్తులతో నాగాలమ్మ పంచలోహ విగ్రహ ప్రతిష్ట అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో అమ్మవారి ఉత్సవ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అరగొండ ప్రజలు గ్రామదేవతగా కొలిచే నాగాలమ్మ రెండు రోజులపాటు పొంగళ్లు పెట్టి, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం ఉదయం వేదపండితులచే నూతనంగా తయారు చేసిన పంచలోహ నాగాలమ్మ ఉత్సవ విగ్రహానికి ధర్మకర్త జయచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు అభిషేకం చేయించారు. అనంతరం విగ్రహానికి ప్రాణప్రతిష్ట చేయించారు. అమ్మ విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేశారు. తర్వాత హోమం నిర్వహించి పూర్ణాహుతి, కలశ ఉద్వాసన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రిలో అమ్మ వారి విగ్రహాన్ని ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

చెవుటి గంగమ్మకు పాలాభిషేకం

పాలసముద్రం: మండలంలోని క్రిష్ణజమ్మపురం పంచాయతీ బలిజకండ్రిగలోని చెవుటి గంగమ్మకు శుక్రవారం పాలాభిషేకం, అంబలి సమర్పణ కోలాహలంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకుడు నవగ్రహ హోమం, శాంతి హోమం చేశారు. హోమ కలశపు నీటితో అమ్మవారిని అభిషేకించారు. 10 గంటలకు ప్రతి ఇంటి నుండి మహిళలు అంబలి, పాలు, పసుపు నీటి బిందెలతో నయ్యాడి వాయిద్యాలతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అమ్మవారిని అభిషేకించడానికి వచ్చిన మహిళలతో కిక్కిరిసింది. అభిషేకాల అనంతరం అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు.

భక్తిశ్రద్ధలతో శుభ శుక్రవారం



పూతలపట్టు: శిలువ మోస్తున్న ఏసుప్రభు వేషధారి, కోడిగుట్టలో ఏసుప్రభు వేషధారణలో క్రైస్తవులు



చిత్తూరు: ప్రసంగిస్తున్న టౌన్ చర్చి పాస్టర్ రెవరెండ్ డాల్విన్ క్రిష్టిదాస్, పాల్గొన్న క్రైస్తవులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధన కార్యక్రమాలను నిర్వహించారు. చర్చివీధిలోని టౌన్‌చర్చి, రీడ్స్‌పేట చర్చి, బీటీ మెమోరియల్ చర్చి, తెలుగులూథ్స్ చర్చి, హోసాన్నా మందిరాల్లో గుడ్ ఫ్రైడేను ఉద్దేశించి మత బోధకులు ప్రసంగించారు. ప్రధానంగా ఏడు వ్యాఖ్యలపై క్రైస్తవులకు వివరించి, ఉపవాస దీక్షలను విరమించారు. అన్ని చర్చిలు కూడా క్రైస్తవులతో నిండిపోయాయి. ప్రత్యేక గీతాలాపనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఏసు ప్రభువును శిలువ సందేశాలను ఉద్దేశించి చిన్నారులు ప్రదర్శించిన నాటక సన్నివేశం ఆకట్టుకుంది. తదనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సేవ కార్యక్రమాలు చేపట్టారు.

ఘనంగా కరుణామయుడికి ప్రార్థనలు

యాదమరి (పూతలపట్టు): మండలంలో క్రైస్తవులు శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మండలంలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనలు నిర్వహించారు. శుభ శుక్రవారం ప్రాముఖ్యతను మత బోధకులు విశ్వాసులకు వివరించారు. మండలంలో కోడిగుట్ట గ్రామంలో ఏసుప్రభు వేషధారణతో వీధుల్లో ప్రార్థనలు చేస్తూ ఊరేగించారు. ప్రధానంగా ఏసుప్రభు శిలువలో మాట్లాడిన ఏడు వ్యాఖ్యలను వివరించి క్రైస్తవులు దీక్షను విరమించుకున్నారు. ప్రత్యేక గీతాలాపనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఏసుప్రభు శిలువ సందేశాలను ఉద్దేశించి చిన్నారులు ప్రదర్శించిన నాటక సన్నివేశం ఆకట్టుకున్నాయి. మండలంలోని పెరియంబడి, కోణాపల్లి, దాసరాపల్లి, కొటాల, మాధవరం, కోడువూరు గ్రామాల్లో గుడ్‌ఫ్రైడేను ఘనంగా జరుపుకున్నారు.

సాగుకు అండగా రైతు భరోసా

- ఎన్నికల హామీ ప్రకారం రైతన్నలకు ఆర్థిక సాయం
- మండలంలో 7,489 మంది రైతులకు ప్రయోజనం
- నాలుగేళ్లలో రైతులకు రూ.7.61 కోట్లు జమ



వరి పంటకు మందు పిచికారీ చేస్తున్న రైతు

ఐరాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం రైతులు, కౌలు రైతుల కళ్లల్లో ఆనందాన్ని నింపింది. సీఎం వైఎస్ జగన్ నాలుగేళ్లుగా సాగుకు అందిస్తున్న సాయం కళ్లారా చూస్తున్నామని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్టీలు, వర్గాలతో సంబంధం లేకుండా రైతులందరికీ ఈ పథకం వర్తింపజేయడంతో ఎంతో మేలు జరుగుతుందని పలువురు అంటున్నారు. ప్రతి రైతుకి న్యాయం జరిగేలా ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నెరవేర్చింది.

పెట్టుబడికి కొండంత భరోసా

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం సాగుకి ముందుగానే అంటే మేలోనే రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించింది. రైతులకు ఏడాదికి రూ.13,500 చొప్పున జమ చేసింది. ఏడాది మొదటి విడతలో కేంద్రం వాటా రూ.2 వేలు, రాష్ట్రం రూ.5,500 చొప్పున మొత్తం రూ.7,500 రైతు ఖాతాలకు మేలోనే జమచేస్తున్నారు. రెండో విడతగా రూ.4 వేలు చొప్పున మూడో విడతగా రూ.2 వేలు చొప్పున రైతులు పంట సాగు చేయడానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా సాయం అందించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతు భరోసాతో ఎంతో మందికి లబ్ధి

నాలుగేళ్లలో మండలంలో 7,489 మంది రైతులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందారు. ఒక్కొక్క రైతుకి రూ.13,500 చొప్పున నాలుగేళ్లలో 7,489 మంది రైతులకు రూ.7.61 కోట్లు సాయం అందించడంతో రైతులు ఖరీఫ్, రబీ పంటలకు ఇబ్బంది లేకుండా పెట్టుబడి సాయం సీఎం జగన్ ప్రభుత్వం అందించింది.

జగనన్న రైతు పక్షపాతి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి. కరోనా కష్టకాలంలో సైతం ఎంత భారమైనా వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా ఏటా రైతులకు రూ.13,500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు. మా లాంటి రైతులకు విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు డబ్బులు ఉపయోగపడుతున్నాయి. జగనన్న చేసిన మేలు ఎప్పటికీ మరచిపోం.

– సి.ప్రతాప్‌రెడ్డి, రెడ్డివారిపల్లి, ఐరాల

రైతులకు వరం



సాగు సమయంలో రైతు భరోసా ద్వారా వచ్చే నగదు కొండంత అండగా ఉంటోంది. రైతుల కష్టాలు గుర్తించి భరోసా కల్పించడం వల్ల ఎక్కువ మందికి ప్రయోజనం కలుగుతోంది. సకాలంలో నగదు జమ చేయడంతో అప్పులు చేసే బాధ తప్పింది. ఈ ప్రభుత్వం చెప్పింది చెప్పినట్లు చేస్తోంది. ఈ పథకం రైతులకు వరంగా మారింది.

– హరిరెడ్డి, మట్టపల్లి, ఐరాల

రైతులకు చేయూత



వైఎస్సార్ రైతు భరోసా పథకం రైతులకు చేయూతనిస్తోంది. ఏటా సాగు ఖర్చుకు ఉపయోగపడుతోంది. ఈ పథకం దేశంలో ఎక్కాడా లేని విధంగా అమలవడం ఎంతో ఆనందాన్నిస్తోంది. భూ యజమానులకు ఇబ్బంది లేకుండా కౌలు రైతులకు కూడా రైతు భరోసా పథకం వర్తింపజేయటం రైతుల పట్ల జగనన్నకు అభిమానం రుజువు చేసింది.

– పి.నందకుమార్, సీ.వీ.పల్లి, ఐరాల

రైతుల సంతోషాన్ని చూశాను



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుల సంతోషాన్ని చూశాను. జగనన్న పాదయాత్రలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా పథకాన్ని అమలు చేశారు. మే నెలలో పెట్టుబడి సాయం, కోతల సమయంలో ఆర్థిక సాయం అందించి రైతుల కళ్లల్లో ఆనందాన్ని నింపారు. వ్యవసాయానికి ప్రాణం పోశారు. జగనన్న మేలు మరువలేం.

– దేవేంద్రరెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు, ఐరాల

కళత్తూరు కుటుంబంతోనే మా పయనం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యవర్గ సభ్యులు దూదిమోహన్

పెనుమూరు(కార్వేటినగరం): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి కుటుంబంతోనే తమ పయనం సాగుతుందని జిల్లా కార్యవర్గ సభ్యులు దూది మోహన్ అన్నారు. గురువారం పెనుమూరు మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ పార్టీ శ్రేణులతో కలసి ఆయన మాట్లాడారు. కళత్తూరు కుటుంబానికి, పెనుమూరు మండలానికి విడదీయరాని బంధం ఉందన్నారు. ఉప ముఖ్యమంత్రిగా పెనుమూరు మండలంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారని, అలాంటి కుటుంబం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న కళత్తూరు కృపాలక్ష్మిని అఖండ మెజారిటీతో గెలిపించే బాధ్యత పెనుమూరు మండలం నాయకులపై ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో బడుగు బలహీన వర్గాలతో పాటు అగ్రవర్ణాలకు చెందిన పేదవారికి కూడా సంక్షేమ పథకాలు అందించి ఆదుకున్నారని, అలాంటి సంక్షేమ సారథిని మరోసారి సీఎంగా చూడటమే లక్ష్యంగా అందరూ కృషి చేస్తామన్నారు. ఇంటింటా ఎన్నికల ప్రచారం చేస్తామన్నారు. కృపాలక్ష్మి విజయానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మనోహర్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు నీలా పండరినాథ్, జిల్లా యువజన కార్యదర్శి దూది మునేంద్ర, ఏఎంసీ డైరెక్టర్ రవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామయ్య, నాయకులు కలికిరి మురళి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా 'స్వీప్' క్రీడా పోటీలు



క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

చిత్తూరు అర్బన్: స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ యంత్రాంగం క్రీడా పోటీలు నిర్వహించారు. ఇరువారం వద్ద ఉన్న ఓ విద్యాసంస్థ ఆవరణలో ఈ క్రీడాపోటీలను కమిషనర్ ఆదేశాలతో నిర్వహించారు. ఎన్నికల్లో యువత నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఎలాంటి ప్రలోభాలకు లొంగొద్దని అధికారులు పిలుపునిచ్చారు. తొలిసారిగా ఓటుహక్కు వినియోగించుకుంటున్న యువత, ఈ అవకాశం కోసం ఎదురుచూస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం విద్యార్థులకు పరుగు, ఖో–ఖో, కబడ్డీ, వాలీబాల్, షాట్‌పుట్ లాంటి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వీప్ సహాయ నోడల్ అధికారి చిన్నయ్య, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.